# మళ్ళీ చెప్పిన కథలు



రావి కొండలరావు

## దాహం గల కాకి

వేసవికాలం. దానికితోడు వైశాఖ మాసం. దానికి తోడు మిట్ట మధ్యాహ్నం. దానికితోడు దేశంలో ధరలు మండిపోతున్నట్టు మండిపోతున్న ఎండ. ఆ ఎండలో ఓ కాకి. దాహానికి గొంతు పిడచకట్టుకుపోయి. అరవడానికి కూడా సత్తువలేక. చెట్టు నీడన చేరి "దాహమో దాహం" అనుకుంది మనసులోనే. ఎండని పేలుస్తున్నందుకు సూర్యుడి మీదా. ఇంకా మరికొన్ని కోట్ల మైళ్ళ దూరం పారిపోకుండా సూర్యుడికి దగ్గర్లోనే దేవుల్లాడుతున్న భూమి మీదా చిరాకుపడింది. తనకి అందుబాటులో ఎక్కడా కనిపించనందుకు నీటి మీద విసుక్కుంది. మళ్ళీ "దాహమో దాహం" అనుకుంది- అన్నివేపులా మెడా. ముక్కూ సారించి చూస్తూ ఏదో శబ్దం వినిపిస్తే ఓరకంట చూసింది. ఒక యింటి పెరటి తలుపు ఎవరో తెరిచారు. రివ్వున ఎగిరి తలుపు మీద వాలి. లోపలికి చూసింది. ఎదురుగా పెద్ద బల్ల. బల్లమీద కూజా కనిపించాయి. రెక్కల చప్పుడు కాకుండా నెమ్మదిగా వెళ్ళి కూజాలోకి తొంగి చూసింది. ఆహా! నీళ్ళున్నాయి! కాని! ఎక్కడో పాతాళానికి వున్నాయి. తన ముక్కుకి అందవు. కాకి ఓసారి తనని సృష్టించిన వాడిని తిట్టుకుంది. "అతనికి ఎంత పక్షపాతం!" అంది. "కొంగకి అంత ముక్కా? తనకి ఇంత ముక్కా? తనకే గనక అంతటి పొడుగాటి ముక్కు వుంటే కూజాలో నీళ్ళు జుర్రున పీల్చేసి ఎగిరిపోయివుండనూ!" నిత్యం నీళ్ళల్లోనే జపం చేసే కొంగకి అంత పొడుగాటి ముక్కు అనవసరం! తనకే అవసరం! .... సరే. తిట్టుకుని లాభం లేదని. జరగవలసిన కార్యక్రమం ఆలోచించింది. ఆ కూజాలో నాలుగు రాళ్ళువేస్తే అవిమునిగి నీళ్ళు పైకి వస్తాయి. తనకి ఎంచక్కా అందుతాయి! ఆ ఆలోచన రాగానే కాకి ఎగుర్తూ రాళ్ళ కోసం వసుకెత్తింది. కాని. ఎక్కడా సత్యజిత్ రాయీ లేదు. బంగారప్పా లేదు చిన్నచిన్న రాంమోహన్ రాళ్ళు లాంటివి కూడా ఏ మూలా కనిపించలేదు. "ఇదేమిటి- ఇది మనదేశంకాదా? ఎక్కడా ఒక్క శ్రీ రాయి లేకుండా ఇంత శుభ్రంగా వుందే! దేశంలో నీళ్లు కరువైనట్టు కరువై పోయాయేమిటి!" అని అటూ ఇటూ తిరుగుతూ వుంటే-ఓ ఉడత చెట్టు దిగి—

"ఏమిటి కాకీ. అలా వెతుకుతున్నావు? ఏం పారేసుకున్నావేమిటి?" అని అడిగింది.

"రాళ్ళు కావాలి బుడతా! రాళ్ళు దొరికితేగాని. నీళ్ళు దొరకవు" అంది కాకి.

"రాళ్ళకోసం వెతుకుతున్నావా? ఇక్కడెక్కడా రాళ్ళు లేవు. ఉన్న రాళ్ళన్నీ కొన్ని వందలమందొచ్చి ఏరుకెళ్ళారు."

"ఎందుకూ—వాళ్ళకి నీళ్ళకరువే?"

"అదేం కాదు. ఊరవతల మైదానంలో పొద్దుట్నుంచి ఏదో మీటింగుట. రాజకీయ సమావేశం—జరుగుతోంది. ఆ మీటింగు అంటే కిట్టని వాళ్లు కొందరుంటార్ట. వాళ్ల ఉపన్యాసాలిచ్చేవాళ్ళ మీదా. ఆ ఉపన్యాసాలకి జై కొట్టేవాళ్ళమీదా రాళ్ళేస్తారట. అందుకని ఉన్నరాళ్ళన్నీ చిన్నా. పెద్దా తేడా చూడకుండా. బుట్టల్లోకి ఎత్తి వళ్ళబుట్టల్లా భద్రంగా మోసుకెళ్లారు!" అంది ఉడత.



"ఓరి వీళ్ళ రాళ్ళు నీళ్ళలో పడా! మనుషులు నిక్షేపంలాంటి రాళ్లని అందుకు ఉపయోగిస్తున్నారన్న మాట!"

"అందుకే కాదు కాకీ! సాధారణంగా ఏం చేస్తారంటే. కొందరు ఈ రాళ్ళు తీసుకెళ్లి వర్తకులకి ఇస్తారు. ఆ వర్తకులు రాళ్ళన్నింటినీ చిన్న చిన్న పొడి రాళ్ళలా కొట్టించి. వాటిని బియ్యంలోనూ. పప్పులు. ఉప్పుల్లోనూ కలుపుతారు. సగానికి సగం కలిపి. లాభాలకి లాభాలు సంపాయిస్తారు. అంచేత. అసలే రాళ్ళకి కరువుగా వుంటే వున్నవాటిని కాస్తా ఇవాళ ఈ మీటింగు వాళ్ళు ఏరుకు వెళ్లారు."

"ఐతే ఇప్పుడు అక్కడికి వెళ్తేగాని. రాళ్లు దొరకవన్నమాట" అంది కాకి సాలోచనగా.

"నాలుగు రాళ్ళు సంపాయించాలంటే. నువ్వూ మీటింగుకెళ్ళాలిమరి!" అంది ఉడత నవ్వుతూ.

"సర్లే! ఏం చేస్తాం వస్తా. నీళ్ళ చుక్క లేక గొంతు ఆర్చుకుపోతోంది" అని కాకి బయల్దేరింది.

"జాగర్త. అక్కడ నీబట్టలవాళ్లుంటారు. నువ్వు రాళ్ళేరినట్టు కనిపిస్తే తుపాకితో కాల్చేస్తారు."

"నా బట్టల వాళ్ళేమిటీ?"

"అదేలే కాకి బట్టలవాళ్ళు. పోలీసులంటారు!" అని తన తెలివికి మురిసిపోతూ గోడమీదికి అక్కడ నుంచి చెట్టు మీదికీ పారిపోయింది ఉడత.

కాకి—మీటింగు దగ్గరకి ఎగిరేసరికి. వేలాది జనం కేకలూ గగ్గోలుతో పరుగెడుతున్నారు. రాళ్లన్నీ ఏమైనాయో ఏమిటో గాని. అంతటా భగభగమని మంటలు! మీటింగు జరిగే వేదిక. ఆ చుట్టూ వున్న ఇళ్లూ అంత ఎత్తున మండిపోతున్నాయి. అసలే ఎండ; ఆ మంటతో ఈ మంటలు! ఈ జనానికి వేరే పనేం లేదన్నమాట. విసిరినంత సేపు రాళ్లు విసిరి. మంటలు పెట్టి ధ్వంసం చేస్తున్నారు! అంతలో కాకికి నీళ్లు కనిపించాయి! "ఎలా కనిపించాయి?- లారీల్లో వున్న నీరు గొట్టాలద్వారా వచ్చి. మంటలార్పుతూ కనిపించాయి! "ఎంత నీరు వృధా అయిపోతోందో!" అనుకుంది కాకి- గొంతు గుటక వేస్తూ. ఆ నీళ్లు తనకి అందవు. ఆ మంటల దగ్గరికి తను వెళ్ళనూ లేదు. "తాగవలసిన నీటిని ఈ మనుషులు ఎలా తగలెడుతున్నారో" అని విసుక్కుంది కాకి. నీళ్ళకోసం పనికొచ్చే రాళ్ళ విలువా. నీళ్ళ విలువా తెలియని మనుషులు! కాకి ఇంక అక్కడ నించోలేదు. "నీటికోసం రాళ్ళు వెతుక్కోడం కంటె. నీళ్ళే వెతుక్కోడం మేలు!" అని ఇంకో ఆలోచన రాగా కూజా వున్న ఇంటికే వచ్చింది. మెల్లిగా కూజా పక్కగా వాలి- కాలితోనూ. నోటితోనూ కూజాను నెమ్మదిగా ఏటవాలుగా వంచింది. నీళ్లు కూజా మూతిదగ్గర కొచ్చి. కాకి మూతికి అందాయి. కడుపారా నీళ్ళు తాగేసి. అనవసరంగా తనకి శ్రమ కలిగించిన వాళ్ళందరినీ శాపనార్థాలు పెట్టి. నీడపట్టుకు ఎగిరిపోయింది కాకి.